క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆరు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు గురువారం తెలిపారు. పాశర్ల పూడి మెయిన్ రోడ్డులో 11 కేవీ లైన్‌లో కరెంటు స్తంభాలు మారుస్తున్న కారణంగా పాశర్లపూడి, పాశర్లపూడిబాడవ, బి.దొడ్డవరం, పెదపట్నం లంక, పాశర్లపూడిలంక, బాడిలంక ప్రాంతాలకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

నేటి నుంచి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు

మామిడికుదురు: లూటుకుర్రులో నూతనంగా నిర్మించిన పాళ్లమ్మ ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు గోకవరపు రామకృష్ణ, గ్రామస్తులు గురువారం తెలిపారు. ఈ ప్రతిష్ఠా మహోత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. 23వ తేదీ ఆదివారం ఉదయం 11.50 గంటలకు పాళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా శ్రీరామ సప్తాహం

ఆలమూరు: పినపళ్లలో ఉన్న మెరక వీధి రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామ సప్తాహానికి భక్తులు పోటెత్తారు. 29వ శ్రీరామ సప్తాహ మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం గ్రామానికి చెందిన తోరాటి వీర్రాజు దంపతులు పీటలపై కూర్చుని పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సందడి మధ్య మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్లి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన శ్రీరామ భక్త భజన బృందం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన పవళింపు సేవ, గురువారం వేకువజామున నిర్వహించిన ప్రభాత సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

25 లోపు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కావాలి

కొత్తపేట: భూమి ఉన్న రైతులు అందరూ ఫార్మర్ రిజిస్ట్రీలో తమ పేర్లను ఈ నెల 25వ తేదీ లోపు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) జీ పద్మలత సూచించారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతుల పేర్లు నమోదు ప్రక్రియను ఏఓ పద్మలత పరిశీలించారు. ఆధార్ కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం సొంత భూమిఉన్న రైతులకు 'విశిష్ట గుర్తింపు సంఖ్య'తో కిసాన్ కార్డు జారీ చేస్తోందన్నారు. భవిష్యత్‌లో ఈ కార్డు కలిగిన వారికి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు మంజూరవుతాయన్నారు. మండలంలో మొత్తం 5,442 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు కాగా ఇప్పటి వరకూ 2,940 మంది మాత్రమే నమోదయ్యారని తెలిపారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కాకినాడ వారి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 24న ఉదయం 10 గంటలకు సీజ్ చేసిన వాహనాలను వేలం పాట నిర్వహించనున్నారు. వేలంపాటలో పాల్గొనేవారు వ్యక్తిగతమైన గుర్తింపు కార్డుతో పాటు రూ.రెండు వేలు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. పాటలో వాహనం దక్కించుకున్న వారు వాహనం ధరతోపాటు 18 శాతం మేర జీఎస్టీ చెల్లించి తీసుకువెళ్లాలని ఆయన చెప్పారు. వేలం పాట రద్దు చేయడం, వాయిదా వేయడంపై పూర్తి అధికారాలు ఎక్సైజ్ శాఖకు ఉంటాయని సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

ఘనంగా దుర్గమ్మకు జాతర

అయినవిల్లి: నల్లచెరువు గ్రామంలో ఉన్న దుర్గమ్మవారికి జాతర మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి కానుకలు మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు.

వైద్య ఖర్చులకు సాయం

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలో పేగు వ్యాధితో బాధపడుతున్న రోజువారీ కూలీ కుటుంబానికి చెందిన చిన్నారి యాగాడి సూర్యకు కువైట్ కేంద్రంగా ఉన్న ఆదర్శ ఆంధ్రా యూత్(సామాజిక సేవా సంఘం) గురువారం సాయం చేసింది. ఈ మేరకు సంఘ ఫౌండర్స్ మోకా స్వామి, ఇంజేటి కృష్ణకుమార్ సమకూర్చిన రూ.10 వేలు నగదును, మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర చేతుల మీదుగా సూర్య కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ ఈద రవిరెడ్డి, నాయకులు తాడి సహదేవ్, తోటి జాన్‌బాబు, ఇంజేటి శ్యామ్‌బాబు, కోనపల్లి వెంకటేశ్వరరావు, ఎం.బుజ్జి, నల్లి సుదీర్, పెదపాటి మోహన్ దాస్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 9 మందికి జరిమానా

అయినవిల్లి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జిజడ్జి మహమ్మద్ రహ్మతుల్లా గురువారం 9 మందికి రూ.99 వేలు జరిమానా విధించినట్టు ఎస్సై కె.మనోహర్‌జోషి తెలిపారు. దీనికి సంబంధించిన ఎస్సై తెలిపిన వివరాలు.. ఇటీవల తొమ్మిది మందిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో అదుపులోకి తీసుకుని కోర్టుకు అప్పగించినట్టు తెలిపారు. వీరికి జడ్జి రహ్మతుల్లా ఒకొక్కరికి రూ.11 వేలు చొప్పున 9 మందికి రూ.99వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధిలో అక్రమాలకు చెక్

- సమగ్ర సమాచారం కోసం యాప్ రూపకల్పన
- ఉపాధి కూలీలకు బాసటగా నిలిచిన జన్‌మన్‌రేగా యాప్


అంబాజీపేటలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

అంబాజీపేట: ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టిని సారించింది. ఇన్నాళ్లపాటు అక్రమాలకు అడ్డాగా మారిన ఉపాధి హామీ పనులకు ఇప్పుడు సాంకేతికతతో అడ్డుకట్ట వేసేలా యాప్‌ను రూపొందించింది. కూలీలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఆ యాప్‌లో నిక్షిప్తమై ఉంటుంది. దీంతో ఈ పథకంలో పని చేసే కూలీల వేతన బకాయిల కోసం, జాబ్ కార్డుల కోసం ఎంపీడీవో, పోస్టాఫీసుల, ఉపాధి హామీ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణ చేయకుండా వారికి కావాల్సిన సమాచారాన్ని వెంటనే తెలుసుకోవచ్చు. సరైన సమాచారం దొరక్కపోవడంతో తీవ్ర అవస్థలు పడే కూలీలకు ఈ యాప్ వరంలా మారింది. వారి కష్టాలను గుర్తించి ఈ యాప్ అందుబాటులోకి తేవడం ఫోన్లో ఒక క్లిక్‌తో ఇట్టే సమాచారాన్ని పొందే అవకాశం కలిగింది. అదే జన్‌మన్‌రేగా యాప్‌తో అవకతవకలకు చెక్ పెట్ట వచ్చు. కొత్తపేట నియోజకవర్గంలో 39,060 జాబ్‌కార్డులు, 62,501 కూలీలు, పి.గన్నవరం నియోజకవర్గంలో 39,778 జాబ్‌కార్డులు, 59,250 కూలీలు, రాజోలు నియోజకవర్గంలో 21,906 జాబ్‌కార్డులు, 27,766 మంది ఉపాధి కూలీలు ఉన్నారు.

అర్హుల కన్నా అనర్హులకే అందలం

ఉపాధి హామీ పథకం పనుల్లో అర్హుల కన్నా అనర్హులకే లబ్ధి చేకూరుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వచ్చిన పార్టీల నాయకులు తమ అక్రమాలకు ఈ పథకాన్ని అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. దీనితో కష్టించి పని చేసిన కూలీల సొమ్ము అనర్హులకు చేరుతోంది. కూలీలకు న్యాయబద్ధంగా అందాల్సిన సొమ్ముకు కోత పడుతోంది. ఉపాధి హామీ కూలీకి రోజువారీ కూలి సొమ్ము రూ.300 కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఆ మొత్తం చేతికేందడంలేదు. ప్రస్తుతం 100 పనిదినాలు అమలవుతున్నాయి. అయితే పని చేయకపోయినా చేసినట్టు మస్తర్లు వేసుకోవడం, కూలీల సొమ్ము స్వాహా వంటివి బహిరంగ ప్రజా వేదికల్లో ఆడిట్ జరిగే తరుణంలో మాత్రమే వెలుగుల్లోకి వచ్చేవి. ఇకపై ఈ జన్‌మన్‌రేగా ద్వారా అవినీతిని ఇట్టే గుర్తించి ఫిర్యాదు చేయవచ్చు. మస్తర్ల నమోదులో తేడాలను గుర్తించవచ్చు కూలీలతో కాకుండా యంత్రాలతో పని చేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసినా, నిధుల దుర్వినియోగం, దొంగ మస్తర్లకు పాల్పడిన ఈ జన్‌మన్‌రేగాతో ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే సంబంధిత అధికారులు విచారణ చేపడతారు. జన్‌మన్‌రేగా యాప్ ద్వారా కూలీలకు భరోసా కల్పించేందుకు పనుల్లో పారదర్శకతను పెంచేందుకు దోహదపడుతుంది. కొత్తగా వచ్చిన జాతీయ మొబైల్ మానిటరింగ్ సిస్టం పేరిట యాప్ ద్వారా ముఖ ఆధారిత గుర్తింపు యాప్‌తో పనులకు హాజరైన కూలీల ఫొటోలు తీస్తున్నారు. కూలీల సంఖ్య నమోదులో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదు. ఐదు మీటర్ల దూరం నుంచి ఒకే సారి పది మందిని ఈ యాప్ ద్వారా ఫోటో తీయవచ్చు.

యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం



గతంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి వివరాలన్నీ పబ్లిక్ డోమైన్‌లో ఉండేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కార్మికులకు మరింత బాసటగా నిలిచేందుకు జన్‌మన్‌రేగా యాప్‌ను రూపొందించింది. దీని ద్వారా ఎక్కడ ఎటువంటి అవకతవకలకు పాల్పడినా గుర్తించవచ్చు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చు. ఈ యాప్‌ను ప్రతి ఒక్క కార్మికుడు ఫోన్‌లో ఉంచుకోవాలి. యాప్‌పై ఇప్పటికి ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. పనులు మరింత పారదర్శకతతో, సమర్థవంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు చేస్తున్నాం.

– ఎ.శ్రీవెంకట కృష్ణ, ఏపీఓ, అంబాజీపేట

కార్మికులకు బూట్ల వితరణ


వాడపాలెంలో సిమెంటు కాంక్రీటు పోత కార్మికులకు బూట్లు అందజేస్తున్న సురేష్‌కుమార్

కొత్తపేట: వాడపాలెం గ్రామానికి చెందిన సినీనటుడు, వ్యాపారవేత్త చోడిశెట్టి సురేష్‌కుమార్ సిమెంట్ శ్లాబ్ పోత పోసే కార్మికులకు బూట్ల పంపిణీ చేశారు. వాడపాలెంలో పుట్టి పెరిగి సినీ క్యారెక్టర్ ఆర్టిస్టుగా, వ్యాపారవేత్తగా హైదరాబాద్‌లో స్థిరపడిన సురేష్‌కుమార్ ధర్మసూత్ర ఫౌండేషన్ స్థాపించి స్వగ్రామంలో హిందూ ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సమాజానికి తన వంతుగా ఏదో చేయాలనే తపనతో వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భవనాల శ్లాబ్‌లు, సిమెంట్ రోడ్లు కాంక్రీటు పోత పోసినప్పుడు కార్మికులు ఎక్కువ సమయం మిక్సింగ్ సిమెంట్‌లో గడపాల్సి ఉంటుంది. సిమెంట్ వలన కాళ్ల పాదాలు చర్మ వ్యాధికి గురవుతున్నారు. దీనిని గుర్తించిన సురేష్ ఆ కార్మికుల పాదాలు రక్షణకు గమ్ము బూట్లు సమకూర్చారు. వాటిని గురువారం కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు కట్టా శ్రీను, జెడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందుస్వామి, కుడుపూడి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుప్పావడ సేవ


చింతలూరులో స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

ఆలమూరు: చింతలూరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ద్వితీయ వార్షిక పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం నాడు వైష్ణవాలయాల్లో అత్యంత ప్రముఖంగా జరిపే తిరుప్పావడ (అన్న కూటోత్సవం) సేవను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్మ గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గోకుల వాసులందరినీ ప్రకృతి వైపరీత్యం నుంచి రక్షించి, వారందరికీ ఆకలి బాధలు లేకుండా పోషించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ వైష్ణవాలయాల్లో ఈ తిరుప్పావడ సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సేవలో భాగంగా సుమారు 200 కేజీల పులిహోరను స్వామి వారి ఎదురుగా రాశిగా పోసి, నివేదన చేసిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. తిరుప్పావడ సేవను దర్శించడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు.

కన్నుల పండువగా హనుమద్ వాహన సేవ

ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు హనుమద్ వాహనంపై ఆశీనులై స్వామివారు శ్రీరాముని అవతారంలో భక్తులకు అభయమిచ్చారు. హనుమద్ వాహనంపై స్వామి వారు విహరిస్తుంటే భక్తులు తిలకించారు. భక్తులకు భారీ అన్నసమారాధన జరిగింది.

'జ్ఞానజ్యోతి'ని ఆచరణలో పెట్టండి


శాంతకుమారి, విజయశ్రీలను సత్కరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సూపర్ వైజర్స్, పీఆర్పీలు


ఆలమూరులో జ్ఞానజ్యోతిపై శిక్షణ ఇస్తున్న అధికారులు


జ్ఞానజ్యోతి శిక్షణలో బోధనా సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

అయినవిల్లి: జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాల్లో ఆచరణలో పెట్టాలని అప్పుడు మంచి ఫలితాలు వస్తాయని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.శాంతకుమారి, పి.గన్నవరం ప్రాజెక్టుసీడీపీఓ వై.విజయశ్రీ అన్నారు. ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మూడో రోజు జరిగిన జ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.శాంతకుమారి, సీడీపీఓ వై.విజయశ్రీలను సందర్శించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ చిన్నారుల శారీక అభివృద్ధి కృత్యాలపైన, చిన్నారుల సుక్ష్మ, స్థుల కండరాలు అభివృద్ధికి అందించాల్సిన ఆటలు పైన మొదలగు అంశాలపై శిక్షణ నిచ్చారు. మండలంలోని ఎస్.మూలపాలెం, నేదునూరు, అయినవిల్లి సెక్టార్ల పరిధిలో 74 సెంటర్ ఉన్నాయన్నారు. వీరంత చక్కగా శిక్షణ తీసుకుంటున్నారన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.శాంతకుమారి, పి.గన్నవరం ప్రాజెక్టు సీడీపీఓ వై.విజయశ్రీ సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ గౌరీ, వరలక్ష్మి, సీఆర్పీలు, వి.పల్లం రాజు, పసుపులేటి శ్రీనివాస్, బీర సందీప్ తదితరులు ఉన్నారు.

చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు జ్ఞానజ్యోతి

ఆలమూరు: చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని చేపట్టిందని ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి, ఎంపీడీఓ ఏ రాజు అన్నారు. ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు గురువారం నాటికి మూడు రోజులు పూర్తయ్యాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టిఎస్‌వి.నాగలక్ష్మి, వై.అరుంధతి, ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొని ప్రీ స్కూల్ విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధించాల్సిన విషయాలను వివరించారు. సంపూర్ణ ఆరోగ్యానికి అనుసరించవలసిన విధానాలను తెలియజేశారు. ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎస్‌వీ సుబ్బరాజు, ఉపాధ్యాయులు ఎంవీవీ రామరాజు, ఏ వెంకటేశ్వరరావు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణ పరిశీలన

సఖినేటిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి మూడో రోజు శిక్షణ ప్రోగ్రామ్‌ను గురువారం జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి బొరుసు సుబ్రహ్మణ్యం సందర్శించారు. శిక్షణ ప్రోగ్రాంలో అవగాహన చేసుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి, చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు ఆయన సూచించారు. జ్ఞానజ్యోతి శిక్షణల ద్వారా నేర్చుకున్న విద్యను అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వబాల్య దశ నుంచే బోధించాలని కూడా హితవు పలికారు. ఎంఈవో-1 డీ కిషోర్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం కే వీరాస్వామి, రిసోర్స్ పర్సన్స్ మీరా మున్నీషా, విజయభారతి, చంద్రకళ, శ్రీనివాస్, సత్తిపండు, మధువర్మ పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను గుర్తించాలి

రాజోలు: అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారుల్లో సహజ సిద్ధ సృజనాత్మకతను గుర్తించాలని సమగ్ర శిక్షా సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం రాజోలు బాలికోన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి మొదటి విడత శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చిన్నారుల్లో అభ్యాసన నైపుణ్యాలను గుర్తించే విధంగా బోధనా సామగ్రిని తయారు చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ నల్లి మనోహరం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్రాంతికిరణ్, హెచ్‌ఎం ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్ తదితరులు

అయినవిల్లి: నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అయినవిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగం గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీవీఎస్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. వైద్యాధికారి పి.సంతోష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంతోష్‌కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటు వ్యాధి కావడంతో జాగ్రత్తగా ఉండాలని, వారి వస్తువులు దూరంగా ఉంచాలన్నారు. క్షయవ్యాధి లక్షణాలు గుర్తించి పీహెచ్‌సీ వైద్యాధికారులు సంప్రదించాలన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పి.ప్రసాదరావు, సీహెచ్‌ఓ సుగుణ, ధరణి, హెల్త్ అసిస్టెంట్ తాతాజీ, ఏఎన్‌ఎం నాగజ్యోతి, హైమావతి, ఆశావర్కర్లు ఉన్నారు.

క్షయ వ్యాధి నివారణ అందరి బాధ్యత

రాజోలు: క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా క్షయ నివారణాధికారిణి డాక్టర్ సిహెచ్.వి.భరతలక్ష్మి అన్నారు. గురువారం తాటిపాక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్షయ వ్యాధి లక్షణాలు, క్షయ నిర్ధారణ పరీక్షలు, నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌టీఎస్ డి.చక్రధర్, ఎస్‌టీఎల్‌ఎస్ జి.సర్వారాయుడు పాల్గొన్నారు.

రంకిరెడ్డి కాశీ మృతికి సంతాపం


రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ (ఫైల్)

కొత్తపేట: క్రీడాకారులు, పీడీ, పీఈటీలకు మార్గదర్శిగా ఉన్న రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ మృతికి పూర్వ, ప్రస్తుత క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు. అమలాపురంలో స్థిరపడిన కాశీ స్వగ్రామం కొత్తపేట మండలం వాడపాలెం. అమ్మమ్మది వానపల్లి, అత్తవారిది కొత్తపేట. ఇలా కొత్తపేట మండలంతో కాశీకి మంచి అనుబంధం ఉంది. కాశీ గురువారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారన్న సమాచారంతో క్రీడాకారులు, పీడీ, పీఈటీలతో పాటు ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వై.చంద్రశేఖరం, స్టాఫ్ సెక్రటరీ నల్లం సత్యనారాయణరావు, పీడీ సలాది వెంకటరమణ ఆధ్వర్యంలో కాశీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు, పీడీ, పీఈటీల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, కోర్డినేటర్ వైఎస్ రమాదేవి, పీ గన్నవరం జోన్ సెక్రటరీ ముత్యాల పవన్‌కిషోర్ తదితరులు కాశీ మృతిపై సంతాపం వ్యక్తం తెలిపారు . వానపల్లి గ్రామానికి చెందిన బాలగణపతి లయ కమిటీ సభ్యుడు తోరాటి లక్ష్మణమూర్తినాయుడు సంతాపం ప్రకటించారు.

కాశీవిశ్వనాథం మృతి తీరని లోటు

అంబాజీపేట: జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ రిఫరీ, రిటైర్డ్ హెచ్‌ఎం రంకిరెడ్డి కాశీ విశ్వనాథం మృతి క్రీడా లోకానికి తీరని లోటు అని అంబాజీపేట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి కొర్లపాటి వీర వెంకట సత్యనారాయణ (బాబులు) అన్నారు. కాశీ మృతికి అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పుర్వపు విద్యార్థులు, క్రీడాకారులు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. సత్యనారాయణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పితాని త్రిమూర్తులు మాట్లాడుతూ కాశీ సేవలు మరువలేనివన్నారు. పాఠశాల పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, వెటరన్ క్రీడాకారులు గోదాసి శ్రీను, కొర్లపాటి వెంకటేశ్వరరావు, కోటిపల్లి శ్రీను, బొంతు రమేష్, మేడిద సతీష్, కె.దావీదు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కొత్తపేట: ఒక కుటుంబాన్ని మభ్యపెట్టి బంగారం వస్తువులు దొంగిలించుకుపోయిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి, ఆ వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై జీ సురేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం సమయంలో ఓ వ్యక్తి స్థానిక పనసలదొడ్డి గ్రామంలో గుబ్బల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇంటికి వెళ్లి, నేను సచివాలయం నుంచి వచ్చాను. మీకు పీఎంవై పథకం కింద లోన్ వస్తుందని చెప్పి, ఆధార్ కార్డు ఇమ్మని అడిగి తీసుకున్నాడు. ఈ రోజు లాస్ట్ రోజు అని వెంకటేశ్వరరావు దంపతులను నమ్మించాడు. వారిద్దరినీ తన మోటారుసైకిల్ ఎక్కించుకుని స్థానిక కమ్మిరెడ్డిపాలెం తాళ్లమ్మ రావిచెట్టు సెంటర్ వద్ద జిరాక్స్ తీసుకుని వస్తాను ఇక్కడే ఉండండి అని చెప్పి తిరిగి వారి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న వెంకటేశ్వరరావు కుమార్తెతో మీ నాన్న ఫొటో ఇమ్మన్నాడు అని చెప్పి, మాటల్లో పెట్టి ఆమె మెడలో ఉన్న బంగారం చైను, లాకెట్, చేతికి ఉన్న ఉంగరం లాక్కుని అక్కడ నుంచి పరారయ్యాడు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టి తక్కువ సమయంలో బుధవారం శివకోడు గ్రామానికి చెందిన ఎల్లమిల్లి వెంకటరమణ (గాబ్రియల్ అనే కిషోర్) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని చోరీకి గురైన బంగారం వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

దివ్యాంగుల సమస్యల గుర్తింపు సర్వే

సఖినేటిపల్లి: మోరి గ్రామంలో గురువారం రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ కమిటీ సభ్యులు దివ్యాంగుల సమస్యల గుర్తింపుపై సర్వే చేపట్టారు. ప్యానల్ లాయర్లు జెహెచ్ సాగర్, డి.శ్రీనివాస్, పారాలీగల్ వలంటీర్లు కె.మహేష్, డి.సుబ్బలక్ష్మి ఇంటింటా సర్వే చేశారు. శారీరక, మానసిక దివ్యాంగులను గుర్తించి, వారి సమస్యలను తెలుసుకుని, వారికి అవసరమైన సలహాలు, సూచనలు తల్లులకు చేశారు.

శ్రీనివాసరావు పరామర్శ

అయినవిల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న శానపల్లి లంక తూర్పు పేటకు చెందిన ఉందుర్తి శివను, అనారోగ్యంతో బాధపడుతున్న శానపల్లిలంక గ్రామానికి చెందిన వనచర్ల సత్యనారాయణను పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ ఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఆయన వెంట మండల వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండలశాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, శానపల్లి లంక ఎంపీటీసీ పశ్చిమాల సుబ్బారావు, నాయకులు కడలి భూపతి, పల్లి ఈశ్వరరావు, రెడ్డి రాజు, కుడుపూడి వెంకటేశ్వరరావు తదితర నాయకులు ఉన్నారు.

అన్నమయ్య సంకీర్తనాచార్యుడు శ్రీనివాస్‌కు సత్కారం

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో నిరంతరాయంగా గోవింద మాలదారులతో స్వామివారికి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన స్వామివారి భక్తులు (పురుషులు) ఈ నెల 4వ తేదీన (21 రోజుల దీక్ష), మహిళలు 14వ తేదీన (11 రోజుల దీక్ష) గోవిందమాల ధరించారు. మాలదారుల పూజల్లో భాగంగా బుధవారం దశావతారాల పూజలను అన్నమాచార్య సంకీర్తనాచారి శ్రీనివాసరావు వైభవంగా నిర్వహించారు. ఆయనను గోవింద మాలాదీక్షాదారులు ఘనంగా సత్కరించారు.

మొక్కలను సంరక్షిద్దాం

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, స్వచ్ఛాంధ్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని మొక్కలు నాటారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులుతదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి అలవర్చేందుకు స్కౌట్స్ అవసరం


అంబాజీపేటలో పాల్గొన్న స్కౌట్ విద్యార్థులు

అయినవిల్లి: విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన దేశభక్తి అలవరచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ అవసరమని ఎంఈఓ పి.శ్రీనివాస్ అన్నారు. గురువారం ముక్తేశ్వరం జయంతి రామయ్య పంతులు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్ అండ్ గైడ్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన ఏఈఓ పి.శ్రీనివాస్ ప్రారంభించారు. అండ్ గైడ్స్ సీనియర్ ఉపాధ్యాయులు, రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి జొన్నలగడ్డ గోపాలకృష్ణ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ సభ్యులకు 32 మందికి క్యాపు ధరింపజేశారు. ఎంఈఓ పి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు గణేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావం, దేశభక్తి అలవరుచుకుని దేశ సమగ్రతకు మంచి భావిభారత పౌరులుగా ఎదగాలని కోరారు. అనంతరం సీనియర్ స్కౌట్ ఉపాధ్యాయులు జొన్నలగడ్డ గోపాలకృష్ణ దుస్సాలువతో ఘనంగా సన్మానించారు. స్కౌట్ ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ, బీవీవీ కుమారి, షేక్ అమెజాని తదితరులు ఉన్నారు.

సమాజ సేవకులుగా పేరు తెచ్చుకోవాలి

అంబాజీపేట: దేశభక్తిని క్రమశిక్షణను పెంపొందించుకుని సమాజ సేవకులుగా పేరు తెచ్చుకోవాలని ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం కడలి సాయిరాం అధ్యక్షతన సీనియర్ స్కౌట్, గైడ్స్ సలహాదారుడు జేవీఎస్ కె.గోపాలకృష్ణ నేతృత్వంలో స్కౌట్ అండ్ గైడ్స్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైస్కూల్ నుంచి ఎంపికైన 16 మంది బాలికలు, 16 మంది బాలురు, శిక్షణ పొందిన స్కౌట్ టీచర్లు ఎల్.వెంకటేశ్వరరావు, టి.రమాకుమారిలచే స్కౌట్ అండ్ గైడ్ నియమ నిబంధనలచే ప్రమాణం చేయించారు. విద్యార్థినులు చేయి విధులపై వివరించారు. అనంతరం స్కౌట్ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బందారు అమ్మాజీ, స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, బీఎస్‌ఎన్ మూర్తి పాల్గొన్నారు.

శెట్టిబలిజ కులాన్ని అవమానించిన వారిపై ఫిర్యాదు

రాజోలు: సోషల్ మీడియా వేదికగా శెట్టిబలిజ కులాన్ని అవమానిస్తూ, ఆ సామాజిక వర్గానికి చెందిన మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై రాజోలు సీఐ నరేష్ కుమార్‌కు రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. వీరవాసరం, అల్లవరం, పల్లంకుర్రు, రైల్వేకోడూరు, పాలకొల్లు ప్రాంతాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు సోషల్ మీడియాలో శెట్టిబలిజ కులాన్ని అవహేళన చేస్తూ పోస్టులు పెట్టారన్నారు. వారితోపాటు ఆ పోస్టులను లైక్‌లు, షేర్‌లు చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేయాలని కోరారు. నాయకులు గుబ్బల బాబ్జి, మనోహర్, శ్రీనివాస్, నరసింహస్వామి, మొల్లేటి వెంకట నరసింహ సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, కుశులుడు, కంచి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.